## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి జలాభిషేకం



కేటీదొడ్డి: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని వెంకటాపురం, పాగుంట గ్రామాల ప్రజలు పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కాడెద్దుల, ఎడ్లబండ్లతో కృష్ణానది నీటిని తీసుకొచ్చి శనివారం అభిషేకాలు చేశారు. పవిత్ర జలాలను పల్లకీ సేవతో ఊరేగించారు.

### రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



గద్వాలటౌన్: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక షేరేల్లివీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం బృందావనానికి అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శేషదాస భజన మండలి సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. అదే విధంగా రాజవీధి, భీంనగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయాల్లోనూ ఉత్సవాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

### ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ



అలంపూర్: మండల ఏపీఎంగా మార్తమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాజోళి మండల ఏపీఎంగా ఉన్న ఆమె బదిలీపై వచ్చారు. నియామక పత్రాన్ని మండల సమాఖ్య అధ్యక్షురాలు శాలమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సీసీ జయలక్ష్మి, ఎంఎస్ అకౌంటెంట్ సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ సేవలు అందించాలి



అయిజ: పోలీస్ అధికారులు బదిలీపై వెళ్లి ఎక్కడ పనిచేస్తున్నా సరే ఉత్తమ సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ధరూరు మండలానికి బదిలీ అయిన కానిస్టేబుల్ రాజును శనివారం శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ బృందం పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి.. కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలోని వైకుంఠదామం స్థలంలో శనివారం పేకాట ఆడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. ఇద్దరు కర్నూలుకు చెందిన వారని, 5 మంది పుల్లూరు గ్రామానికి చెందిన వారన్నారు. వారి వద్ద వారి వద్ద రూ.14,580 నగదు, మూడు బైక్‌లు, 6 ఫోన్లు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

### చేపల ఉత్పత్తిదారులను ఆదుకోవాలి

ఆత్మకూర్: చేపపిల్లల ఉత్పత్తి దారులను గత ప్రభుత్వం మోసం చేసిందని సరఫరాకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులఊబిలో కూరుకుపోయామని ఉత్పత్తి దారుడు ఏటికాడి ఆనంద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ప్రభుత్వ ఆదేశాలతో చేప పిల్లలను సరఫరా చేశామని, తనకు రూ.40 లక్షలు బిల్లులు రావల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తనతోపాటు మిగితా ఉత్పత్తిదారులు తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసాను ఇచ్చినట్లు తెలిపారు.

# కూలీ రేట్లకు రెక్కలు



నందిన్నెలో పత్తిలో పనులు చేస్తున్న కూలీలు

- అమాంతం పెరిగిన రేట్లు
- రూ.800 వరకు డిమాండ్
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కేటీదొడ్డి: ఆరుగాలం కష్టపడే రైతన్నలకు ఏటా కష్టాలు తప్పటం లేదు. అతివృష్టి, అనావృష్టితో పాటు కూలీల కొరత అన్నదాతలను వేధిస్తున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లను పెంచుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

**వరి, పత్తికి ప్రాధాన్యం..**

మండలంలోని చెరువులు, కాలువలు, బోరుబావులు కింద వరి సాగుతో పాటు పత్తి, మిర్చి, మొక్కజొన్న ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉన్న కొద్దిపాటి భూములను ఎవరికి వారు సాగు చేస్తుండటంతో కూలీల కొరత అధికమైంది. ఎకరం భూమిలో దుక్కులు దున్నటం , నాట్లు వేయటం మందు చల్లటం వంటి పనులు చేయాలంటే సుమారు 12 మంది కూలీలు అవసరం ఉంటుంది. ఇక పత్తి, మిర్చి పంటల్లో 20 మంది వరకు కూలీలు అవసరముంటుంది. కానీ ఎవరి పొలాలను వాళ్లు సాగు చేస్తుండటంతో కూలీల కొరత అధికంగా ఉంది. దీంతో పరిసర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.



కేటీదొడ్డిలో నారు తీస్తున్న కూలీలు

**సాగు వివరాలు**

మండలంలో వరి 13,120, పత్తి 7,120, వేరుశనగ 2,050, కంది 750 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

**అమాంతం పెరిగిన రేట్లు**

మారుతున్న కాలంలో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూలీల కొరత ఉండటం వల్ల కూలీ రేట్లను అమాంతంగా పెంచేశారు. దీంతో రైతులు పరిసర గ్రామాల నుంచి కూలీలను అడిగినంత కూలీ చెల్లిస్తూ ప్రత్యేక వాహనాల్లో తీసుకురావాల్సి వస్తుందని వాపోతున్నారు. గతేడాది మహిళలకు కూలి రూ.150 నుంచి రూ. 250 వరకు ఉండేది. కానీ ఈ ఏడాది రూ.400 నుంచి 500 వరకు పెరిగింది. అదే విధంగా పురుషులకు రూ.500 నుంచి రూ. 800 వరకు చెల్లించాలని రైతులు వాపోతున్నారు.

**ధరలు పెరిగాయి**



గతేడాది కంటే ఈ ఏడాది కూలి ధరలు అమాంతం పెరిగాయి. రూ. 500 నుంచి రూ.800 వరకు కూలి పెరిగింది. పురుషులతో సమానంగా ఆడవాళ్లకు కూడా చెల్లించాల్సి వస్తోంది.

– స్వామి, కేటీదొడ్డి

**కూలీలు దొరకటం లేదు**



గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఇతర గ్రామాలకు చెందిన రైతులు ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకెళ్లటంతో స్థానిక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

– అంజనేయులు, ఇర్కిచేడు

# వల విసిరి వినూత్న నిరసన

అయిజ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. ఈ నేపథ్యంలో శనివారం బీజేపీ నాయకులు చేపల వల విసిరి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం ముందే మురుగు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మురుగుతో దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు ఉధృతి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు మండిపడ్డారు. కనీసం పీహెచ్‌సీ ప్రహరీ గేటు దాటి లోపలికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. పీహెచ్‌సీ భవనం చుట్టూ సీసీరోడ్డు వేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదన్న, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు వీరయ్య, లక్ష్మణాచారి, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ఎదుట చేపల వల విసురుతున్న బీజేపీ నాయకులు

# చెరువులను తలపిస్తున్న రోడ్లు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. వార్డుల పర్యటనలో భాగంగా శనివారం మున్సిపాలిటి పరిధిలోని 9వ వార్డులో బీజేపీ నాయకులు పర్యటించారు. ప్రధాన రోడ్డుపై వాల్మీకి ఆలయం సమీపంలో వర్షం నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. గతంలో కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసిన పట్టించుకోలేదని మండిపడ్డారు. అదే విధంగా మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయని, అధికారులు వెంటనే స్పందించి వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన నీటిలో నిల్చొని నిరసన తెలుపుతున్న నాయకులు

## గోమాతకు విశేష పూజలు



శాంతినగర్: హిందువుల ఆరాధ్య దైవం గోమాతకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి, శ్రవణా నక్షత్రం పర్వదినం సందర్భంగా గో ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గాయత్రి గోమాతకు మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో గో ప్రచార సేవా సమితి అధ్యక్షుడు రామచంద్రుడు, సభ్యులు దొంతు శ్రీనివాసులు, గాయత్రి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దరఖాస్తు చేసుకోండి

అయిజ: రైతుబీమా కోసం అర్హులైన వారు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్, నామిని ఆధార్ కార్డు జిరా క్సలు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

# ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



ఎర్రవల్లిలో అన్నకు రాఖీ కడుతున్న సోదరి



ఇటిక్యాలలో సోదరులకు రాఖీ కడుతున్న చెల్లి



ధరూరులో రాఖీలు కడుతున్న చిన్నారులు

సాక్షి నెట్‌వర్క్: అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిర్వహించే రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ పౌర్ణమి (రాఖీపౌర్ణమి) రోజు నిర్వహించే రక్షా బంధన్ వేడుకలకు సుదూర ప్రాంతాల నుంచి ఆడపడుచులు పుట్టినిళ్లకు చేరుకున్నారు. సోదరులకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి వారి ప్రేమను చాటుకున్నారు. సోదరీమణులకు అన్న, తమ్ముళ్లు రక్షణగా ఉంటానని హామీనిస్తూ నగదు, నూతన వస్త్రాలు, ఆభరణాలు అందజేసి వారి ఆత్మీయతను చాటుకున్నారు. అదే విధంగా జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



అమరవాయిలో సోదరులకు రాఖీ కడుతున్న చెల్లెలు



కేటీదొడ్డిలో రాఖీ కడుతున్న మహిళ



శాంతినగర్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరీమణులు



శివాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# విజయరాయుడికి ప్రత్యేక పూజలు

అయిజ: మండలంలోని సంకాపురంలో వెలసిన విజయరాయుడికి భక్తులు శనివారం విశేష పూజలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి విజయరాయ ఆలయం వరకు భజనలతో నిండు బిందెలు తీసుకెళ్లి స్వామికి అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

**ఘనంగా తిమ్మప్ప స్వామి రథోత్సవం**

పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హోమం, స్వామివారి రథోత్సం కనులపండువగా సాగింది.



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

## ఇసుక టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్ పేర్కొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా సిద్ధం

ఆత్మకూర్: ప్రస్తుత వర్షాకాల పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పట్టణంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం, హాకా రైతుసేవా కేంద్రం, పీఏసీఎస్ ఆత్మకూర్, ప్రాథమిక సహకార సంఘం రేచింతలలో యూరియా సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుత పంటలకు నానో యూరియాను వినియోగించవచ్చని, సుమారు 60 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. మండలంలోని రైతులు ప్రస్తుత దశకు కావాల్సిన ఎరువులను మాత్రమే తీసుకోవాలని, కేంద్రాలను సంప్రదించాలని పేర్కొన్నారు. నిర్దేశిత విధానాల ప్రకారం యూరియాను పొందాలని సూచించారు.

## ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



జూరాలలో కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: పీఎం నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమైందని గడప గడపకు కేంద్రప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కంభళాపురం రాము, మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, నియోజకవర్గ కన్వీనర్ రేచింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని మేడేపల్లి, జూరాల గ్రామాల్లో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తు కరపత్రాలను అందజేశారు. ప్రతి ప్రభుత్వ పథకంలో కేంద్రం వాట ఉందని రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సహదేవుడు, సాయి, నరేష్, శంకర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

# జోరు వర్షం.. పొంగిన వాగులు



ఉండవెల్లి మండలం మెన్నిపాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



మానవపాడు- అమరవాయి మధ్య కల్వర్టుపై పారుతున్న వాగు



మానవపాడు- గోకులపాడు మధ్య ప్రవహిస్తున్న వాగు



ఎర్రవల్లి మండలం షేకుపల్లి వద్ద పెద్దవాగు దాటుతున్న రైతులు



ధరూరులో కురుస్తున్న వర్షం

సాక్షి నెట్‌వర్క్: రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లో వాగుల సమీపంలో రైతులు సాగు చేసిన పత్తి, మిరప, వరి పంటల్లోకి వర్షపు నీరుచేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


- అలంపూర్ మండలంలో కుండపోతగా వర్షం కురిసింది. పట్టణంలోని డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. వరి, పత్తి పంటలకు అధిక నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.
- అయిజలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన కుండపోత వర్షంతో పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. అదే విధంగా తెలంగాణ చౌరస్తా సమీపంలోని గాజులపేట కాలనీ వర్షంనీటితో రోడ్లు మునిగిపోయాయి. మండలంలోని మేడికొండ రోడ్డుపై పోలోని వాగు పొంగిపొర్లింది.
- వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, కోయిల్‌దిన్నె, రామాపురం వాగులపై రెండు నుంచి మూడడుగుల మేర వరద ప్రవహించింది.
- మానవపాడు మండలంలోని నారాయణపురం , మానవపాడు అండర్ రైల్వేబ్రిడ్జిలో వర్షం నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మానవపాడు- అమరవాయి వాగు, మానవపాడు, గోకులపాడు వాగు ఉధృతంగా ప్రవాహించింది.
- రాజోళి మండల పరిధిలోని మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల గ్రామాల మధ్యన ఉన్న వాగు పొంగిపొర్లింది. మాన్‌దొడ్డి సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తూ కంప చెట్లు అడ్డుగా ఉండటంతో వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరాయి.
- ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లి, సాసనూలు, గార్లపాడు సమీపంలోని పలు వాగులు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- ఉండవెల్లి మండలంలో 41.8 వర్షపాతం నమోదవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మెన్నిపాడు వాగు భారీగా ప్రవాహిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు.
- గట్టులో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 51.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.



అయిజ పట్టణంలోని గాజులపేటలో మునిగిన రోడ్డు



రాజోళి మండలం మాన్‌దొడ్డిలో ముళ్ల కంపలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



అలంపూర్ చౌరస్తాలో ఉల్లి పంటలో నిలిచిన వర్షపు నీరు